# కొద్ది కథలు

## శిష్యుడే గురువు

బడిలో వుపాధ్యాయుడు అహింసను గురించి బోధిస్తూ మాంసాహారం మంచిదికాదని, అది జీవహింసనీ చెప్పి దానిమీద విద్యార్థుల్ని వ్యాసం వ్రాయమన్నాడు. అందరూ యేదో వ్రాశారు. వేణు చాల తెలివైనవాడు. ''మాంసాహారం జీవహింసే. కాని అంతకంటే ఘోరమైన హింసలు కూడా వున్నాయి. జంతువుల్ని కత్తితో ఒకేసారి నరికేస్తారు. దానిబాధ కొంచెంసేపే. కాని మానవుల్ని మానవులే కత్తిలేకుండానే తమ కరకుమాటలచేత క్రూరకృత్యాలచేత ప్రతి క్షణం చిత్రవధచేస్తున్నారు. ముఖ్యంగా అగ్నిసాక్షిగా వివాహమాడిన భార్య యెంతో అందంగావుండి భక్తితో ప్రేమిస్తున్నాగాని ఆమెను నిర్దయగా అష్టకష్టాలు పెట్టి పరకాంతలపాలైపోతున్నా రెందరో. ఇది ఆమె హృదయములో తీరనిబాధని వారికి తెలియదేమో. ఇంతకంటే వేరే పెద్ద హింస లేదు'' అని వ్రాశాడు. ఇదంతా చదివి వుపాధ్యాయుడు అలాగే రాతిబొమ్మ లాగుండిపొయ్యాడు. తన విషయం వీడికెల్లా తెలిసిందో ననుకున్నాడు. తన తప్పు బాగా అర్థం చేసుకున్నాడు. వెంటనే ఆయన హృదయం పరివర్తన చెందింది. వేణు చేసిన ఉపకారానికి కృతజ్ఞత చూపదలచుకున్నాడు. ఇప్పుడు శిష్యునే గురువుగా భావిస్తున్నాడు.

కె. రాధిక.

## రూపాయి ముద్దర దక్షిణ

ముద్దరకొట్టేసిన స్టాంపులు, మన దేశంవీ పైదేశంవీ తీసి దాచడం నాకు మహా సరదా. ఒకరోజున మానాన్న గారికి వచ్చిన వీపీమీద రూపాయి ముద్దరతీసి జాగ్రత్తగా దాచేను. అ దాచడంచూచి మాతమ్ముడు ''ఏమిట్రా అన్నయ్యా అది'' అని అడిగేడు. చిన్న కుఱ్ఱాడు అడుగుతున్నాడు కదా అని ''రూపాయికి ఎంత విలువుందో దీనికీ అంతే విలువని చెప్పేను''

మర్నాడు వినాయకచవితని, మా తమ్ముడు స్కూలుకి, కొబ్బరికాయలు అరటిపండ్లు పట్టుకెళ్తాడని కొనితెచ్చేడు బంట్రోతు. మాతమ్ముడు అవన్నీ ఓ పళ్ళెంలోపెట్టి అమ్మ ఇచ్చిన దక్షిణ అణా తీసుకొని స్కూలుకి బయలుదేరుదామనుకున్నాడు. ఇంతలో ఏమి ఆలోచన తట్టిందో వాడికి నాగదిలోకి గబగబా వచ్చి నాకో అణా ఇచ్చి ''సిగిరెట్లు కొనుక్కోరా అన్నయ్యా'' అన్నాడు. ఎందుకురా వీడు దెయ్యానికైనా బిచ్చంపెట్టనివాడు నాకు అణా ఇస్తున్నాడనుకొని సిగిరెట్టు కొనడానికి వెళ్ళినట్టుగ నటించి గోడవార దాంకున్నాను.

ఇంతలో మా వాడు ముద్దరకొట్టిన రూపాయి ముద్దరతీసి పళ్ళెంలోపెట్టి గబగబా స్కూలుకెళ్ళేడు. నేనుకూడా ఏమిటి జరుగుతుందో చూదామని వాని వెనకాలే వెళ్ళేను. మేష్టరుగారు మా తమ్ముడు తెచ్చిన కొబ్బరికాయలు అంటిపళ్ళు అన్నీ అందుకొని దక్షిణ ఎంతరా తెచ్చేవు కన్నా అని అడిగేడు. ''రూపాయండీ'' అని గట్టిగా అన్నాడు మాతమ్ముడు. మేష్టరు మొహం చేటంతయింది. దక్షిణ ఏదన్నాడు. మనవాడు ముద్దరకొట్టేసిన రూపాయిస్టాంపు ఈయగానే మేష్టరుమొహంలో నెత్తురుచుక్క లేకపోవడమే కాకుండా మా కన్నడిని తందామన్నంత కోపం వచ్చింది.

వెనకాలున్న నేను కడుపు చెక్కలయ్యేటట్టు నవ్వుకుంటూ మేష్టరుతో సంగతంతా చెప్పేను. మేష్టరుగారికి కోపంవచ్చి ''కన్నా వెధవ గొప్పచెప్పక పోతే, అమ్మగారిచ్చిన అణానే ఈయకూడదూ!'' అని అన్నాడు. మా తమ్ముడు మొహం దించుకున్నాడు.

ఘండికోట అప్పల నరసింహం.

* * *

## తప్పుల తమాషా

ఆనాడు మా గ్రామములో కొత్త సినిమా. కాస్త చీకటి వుండగానే గోడపైన పోస్టర్లు కరిపించుకుంటూ పోతూ ఒక యింటిదగ్గర అంటిస్తూయుండగా ఆ యింటిఆమె అప్పుడే నిద్రనుండిలేచి ఇంటిముందరకువచ్చి అబ్బాయిని ఏం సినిమా నాయనా యీదినం అన్నది. వాడు 'మనమిద్దరము' అన్నాడు. ఆమె కోపంతో ఏరా వెధవా నేను మర్యాదగా అడిగితే నీవు అలా పోకిరిగా జవాబు ఇస్తావేమిరా? ఎందుకురా, నీకంతపొగరు అని తిట్టటం మొదలెట్టింది. ఈ అల్లరి

చూసి ఇరుగుపొరుగువారు పోగై సంగతి తెలుసుకొని లేదమ్మా నీవుపొరబడ్డావు. ఈ దినం మనమిద్దరము అనే ఒక సినిమా అని ఆమెను సమాధానపర్చారు. ఆ అబ్బాయి ఇక ఎన్నడు ఎవరు అడిగినా ఏం సినిమా అంటే పలకనైనా పలకడు. ఇంకా ఎలాంటి విచిత్రమైన సినిమాలు వస్తాయో అని అంటూ వుంటాడు.

జి. పద్మనాభరావు.

* * *

## ఏప్రిలు ఫూల్ అసోసియేషన్

ఆదినము 1 వ తేదీ అందులోను ఏప్రిల్. సాయంత్రం ముస్తాబై నేను, మా స్నేహితులు ప్రోగ్రాముకై ఆలోచించితిమి. అపుడే మా తమిళమిత్రుడొకడు అందరికి ఫ్రీ టిక్కెట్లు పంచుతూ వుండటము చూచి, నాకు అది ఏమిటో తెలిసికొనవలెనని బుద్ధిపుట్టినది. విచారించగా A. F. A. Amateurs (Madura) Variety Entertainment At Parish Hall (Santhome) On 1-4-50 at 5-30p.m. "Admit one" అని వున్నది. వెంటనే అలస్యమయితే హాలునిండి, ఆశాభంగ మగునేమోనని హుషారుగా 4 టిక్కెట్లు తీసి (ఫ్రీ లెండి!) అందరము హుటాహుటి శాంథోముకు వెళ్లినాము. అక్కడ ఏముంది. Parish Hall తలుపులు బిర్రుగా వేసివున్నవి. మా మొగములు దిక్కులు చూచినవి. అపుడు April Fool Association వారి గమ్మత్తు తెలిసి, April Fools అయినందుకు అసోసియేషన్‌వారిని మిక్కిలి అభినందించితిమి.

ఎమ్. వి. రామమూర్తి.

## పేర్లేనంటూరా? ★

రచన : ... "మురళి" ...

వింతకాదు విశేషంకాదు
కల్పనకాదు వూహలుకావు
కలియుగంబులో చెలామణయ్యే
పేర్లచరితను వింతగ చెబుత
ఆలకించండోయ్ బాబు ఔననండి !

చదువను రాయను చదివిన విన్నా
అర్థము కాని నిరక్షరకుక్షిని
సరస్వతమ్మాయని చక్కగపిల్చుట
కనలేదా మరి వినలేదా—

కానీలేక కన్నీరుగార్చి
దుఃఖజలధిలో దొర్లుచునుండె
లలనామణిని లక్ష్మమ్మనుట
కనలేదా మరి వినలేదా—

విటులకోసము సరసులకొరకు
అహోరాత్రముల్ అన్వేషించు
వేశ్యపడుచును సీతమ్మనుట
కనలేదా మరి వినలేదా—

తిరుపతిగుండును స్మరణకుతెచ్చే
బట్టతలగల భామను నేడు
క్రిష్ణవేణని నొక్కిపిల్చుట
కనలేదా మరి వినలేదా—

చీటిమాటికి చిన్నతప్పుకు
జగడమువేసి బజారుకెక్కి
లడాయికోరెడి చవటను మనము
శాంతమ్మాయని చక్కగపిల్చుట
కనలేదా మరి వినలేదా—

నల్లబొగ్గును నిరసించేటి
రంగుగల్గిన రూపవంతుని
సూర్యప్రకాషని పిలుస్తుండేది
కనలేదా మరి వినలేదా—

పిల్లినిచూచి పులిపులిఅంటూ
పౌరుషంలేక పరుగులేసెడి
ధైర్యం వీర్యం రెండూలేని
పిరికిపందను వీరసింహుడనుట
కనలేదా మరి వినలేదా—

బ్రహ్మచర్యపు బ్రతుకునుగడిపి
జీవితాశలేని జీవిని మనము
కామరాజని ప్రేమతో బిల్చుట
కనలేదా మరి వినలేదా—

దమ్మిడీకొరకు దాస్యంచేసి
బిచ్చమెత్తె పిచ్చిపకీర్ని
విశ్వనాథుడని వింతగ పిల్చుట
కనలేదా మరి వినలేదా—

దేహబలిమియూ ధీరతలేని
అస్థిపంజర ఆకారాన్ని
భీమరావని ప్రియముగ పిల్చుట
కనలేదా మరి వినలేదా—

అన్యాయంబున కాకరమయ్యె
నమ్మినవారిని నాశముపరిచె
దుర్గుణశీలుని శ్రీరామయ్యనుట
కనలేదా మరి వినలేదా—

అంతకర్మమూ యింత అధర్మమూ
హిందూమతస్థు లందరికేనని
అన్యకులస్థు లాత్మలా నిలిపి
పకపకమంటూ పరాభవిస్తే
తెలివితక్కువని తీరనిదోషమని
అంటూనేను అయితేమిారు
ఆలకించరు మరి అభినందించరు !

ఆలకించని అభినందించని
అయ్యలకంతా అన్యమతస్థుల
అసార్థకపేర్ల అన్యోన్యత్వం
ఉదాహరణాల్తో విశదీకరిస్తా
ఆగ్రహిస్తారా లేక అభినందిస్తారా !

ఆగ్రహించినా అనుగ్రహించినా
ముస్లిం క్రిస్టను ముద్దుపేర్లలో
ఉండేసత్యం ఉన్నట్లు చెబుతా
ఆలకించండోయ్ బాబు ఔననండి—

ఆడోళ్ళబళ్ళో అమయ్యాపెరట్లో
దుమ్ముచిమ్ముతూ దూళిదులుపుచూ
కాలముతోసే కటికదరిద్రుని
అమీరుసాబని అందరుపిల్చుట
కనలేదా మరి వినలేదా—

బుద్ధికుశలతా సుద్ధినిపుణతా
తెలివితేటా నేర్పూతీర్పూ
ఏమితెలియని యెర్రిమొద్దును
సాల్మన్ అని చక్కగ పిల్చుట
కనలేదా మరి వినలేదా—

ఇలాంటివన్నీ యింకాయెన్నో
తమాషకాని గమ్మత్తులేని
అర్థములేని అసార్థకపేర్ల
విన్నదివున్నది అట్లేచెబితే
పిచ్చివాడని పిలుస్తారనన్ను
అంతేమాత్రము అవుతానా
పిలిస్తేమాత్రము పిచ్చాసుపత్రి కెళ్తానా